క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో లయన్స్‌క్లబ్ 2025–26కు సంబంధించి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రస్తుత అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు తెలిపారు. లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఆకులేటి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా వి.నాగేంద్ర, ట్రెజరర్‌గా కె.వెంకటేష్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్‌క్లబ్ సభ్యులు వెంకటస్వామి, మోహన్‌దాస్, పల్లెం వేణుగోపాల్, గోసె రాధాకృష్ణ, రాజగోపాల్, పుట్లూరు నరసింహులు, రాజీవ్‌నేతలు నూతన కమిటీ సభ్యులను అభినందించారు. లయన్స్‌క్లబ్ నూతన సభ్యులుగా బండి బాబు, వెంకట పార్థసారథి, వెంకటేషుకు సభ్యత్వం అందించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరం: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ ఆదినారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నేతలు చంద్రకళ, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు బాబు కోరారు. పట్టణంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ జూలై 9న సీఐటీయూ, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రాజ్యాంగపరంగా కార్మికులకు సంబంధించిన 29 చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, నాలుగు కార్మిక కోడ్‌లు రద్దు చేయాలని, ఎనిమిది గంటల పనివిధానాన్ని కొనసాగించాలని కోరుతూ సమ్మె చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు హైదర్‌వలి, ఓబిలేసు, దీన, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో చిన్నారులకు వ్యాధుల నివారణ



తాడిమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో టీకాలు వేస్తున్న దృశ్యం

తాడిమర్రి: టీకాలతో చిన్నారులకు వ్యాధుల రాకుండా నివారించవచ్చని పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి గర్భిణులు, బాలింతలకు సూచించారు. స్థానిక 2వ అంగన్‌వాడీ కేంద్రంలో ఏఎన్‌ఎం కోమలి ఆధ్వర్యంలో శనివారం చిన్నారులకు వ్యాక్సినేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుడే జన్మించిన చిన్నారుల నుంచి ఐదేళ్ల వయసులోపు చిన్నారుల వరకు టీకాలు వేయించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని విలేజ్ క్లినిక్‌లలో వైద్య సిబ్బంది ప్రతి బుధవారం , శనివారం చిన్నారులకు టీకాలు వేస్తారన్నారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు ధనమ్మ, లక్ష్మీనారాయణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త భారతి తదితరులు పాల్గొన్నారు.

ఏడు శనివారాల వ్రతానికి పేర్లు నమోదు చేసుకోండి

ధర్మవరం అర్బన్: ఏడు శనివారాల వ్రతం చేయాలనుకునే భక్తులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త చెన్నంశెట్టి జగదీష్‌ప్రసాద్, అర్చకులు రాజేష్ ఆచార్యులు తెలిపారు. పట్టణంలోని శ్రీనివాసనగర్ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జూలై 12 నుంచి ఏడు శనివారాల వ్రతాన్ని ఆలయంలో నిర్వహించనున్నామని తెలిపారు.

నిర్మాణాల పరిశీలన



మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్: ఆర్డీఓ కార్యాలయం పక్కన నూతనంగా నిర్మిస్తున్న మైనార్టీ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల, ముత్యాలచెరువు సమీపంలోని మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాలను శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పరిశీలించారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి ఈ విద్యాసంవత్సరం నుంచే అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీర్ ప్రకాశ్‌ను ఆదేశించారు. ఇప్పటికే 85 పనులు పూర్తయ్యాయని మిగిలిన పనులు సత్వరం చేయాలన్నారు. ఆర్డీఓ వీవీఎస్ శర్మ పాల్గొన్నారు.

నీకు సున్నా.. నీకు సున్నా!



- అమలుకు నోచుకోని ఆడబిడ్డ నిధి పథకం
- నెలకు రూ.1500 ఇస్తామని హామీ
- హామీ నెరవేర్చాలంటున్న మహిళలు

ఓడీచెరువు: నీకు రూ.18 వేలు, నీకు రూ.18 వేలు...ఇదీ ఎన్నికల ప్రచారంలో ట్రెండింగ్‌గా నిలిచింది. సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా 19 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు ప్రతినెలా రూ.1,500 చొప్పున బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తామని పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఆ హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కారణమైన పథకం అమలు చేయాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో మహిళలకే పెద్దపీట

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళల చేతికి చేరిన డబ్బు వృథా కాకుండా ఇంటి అవసరాలకే ఉపయోగపడుతుందని భావించి అనేక పథకాల డబ్బును మహిళల ఖాతాకే జమ చేశారు. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత లాంటి అనేక ముఖ్యమైన పథకాలన్నింటినీ మహిళల అకౌంట్లకే జమ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిపోయినా ఆడబిడ్డనిధికి సంబంధించిన ప్రస్తావనే లేకపోవడం అనేక అనుమానాలు తావిస్తోంది. 19 నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు చెల్లించాల్సి ఉంది. పుట్టపర్తి నియోజక వర్గంలోని మొత్తం మహిళా లబ్ధిదారుల సంఖ్య 1,07,351. ఒక్కొక్కరికి రూ.18 వేల చొప్పున గడిచిన సంవత్సర బకాయిలు రూ.193.23 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మొత్తాన్ని ఒకే విడతలో చెల్లించడంతో పాటు రాబోయే రోజుల్లో నెలనెలా రూ.1500 చెల్లించాలని మహిళలు కోరుతున్నారు.

మండలాల వారీగా కూటమి ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు

మండలం పేరు	లబ్ధిదారుల సంఖ్య	బకాయి మొత్తం (రూపాయలు)
అమడగూరు	11,778	21,20,04,000
ఓడీచెరువు	19,914	35,84,52,000
నల్లమాడ	16,929	30,47,22,000
కొత్తచెరువు	16,858	30,34,44,000
బుక్కపట్నం	16,487	29,67,66,000
పుట్టపర్తి	25,385	45,69,30,000
మొత్తం	1,07,351	193,23,18,000

ప్రభుత్వానిది వంచన



కూటమి ప్రభుత్వం మహిళలను వంచనకు గురిచేసింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయకపోవడం మహిళలను మోస చేయడమే. ఇప్పటికైనా ప్రభుత్వం పథకం అమలు చేసి మహిళల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

– కె.సుకన్య, ఉంట్లవారిపల్లి, ఓడీచెరువు మండలం

ఎప్పుడిస్తారో చెప్పాలి?



కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తుందో వెంటనే చెప్పాలి. హామీ ఇచ్చి సంవత్సర కాలం దాటి పోయింది. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం పథకాన్ని అమలు చేయాలి. దీంతోపాటు ఏడాది బకాయిలు కూడా వెంటనే చెల్లించాలి.

– ఆసాది అంజనమ్మ .దొన్నికోట. నల్లమాడ మండలం

హామీ నెరవేర్చాలి



సూపర్ సిక్స్‌లో భాగంగా ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాలి. పేద మహిళలకు వెంటనే నెలానెలా రూ.1500 ఇవ్వాలి. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా మాకు ఇచ్చిన హామీని నెరవేరుస్తుందని ఆశిస్తున్నాం.

–డి.నాగవేణి కుసుమవారిపల్లి ఓడీచెరువు మండలం

'కొమ్మినేనిది అక్రమ అరెస్ట్ అని తేలింది'

కదిరి: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస రావుది అక్రమ అరెస్ట్ అని సుప్రీంకోర్టు చెప్పిందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రసాద రెడ్డి శనివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. సుప్రీం తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయాలని చూస్తే కోర్టులు చూస్తూ ఊరుకోవని తెలిపారు. చంద్రబాబు మెప్పుకోసం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు పరుస్తున్న కొందరు పోలీసులకు ఈ తీర్పు గుణపాఠం కావాలని పేర్కొన్నారు.

నీట్‌లో కదిరి విద్యార్థులకు ర్యాంకులు



కార్తికేయ



హర్శిత్‌రెడ్డి



మనోజ్‌కుమార్

కదిరి అర్బన్: నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్)లో పట్టణానికి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు కుమారుడు వేమూరి కార్తికేయకు ఆల్ ఇండియా ర్యాంక్ 27,637, ఈడబ్ల్యూఎస్ క్యాటగిరిలో 3,233 ర్యాంకు వచ్చింది. అలాగే మొటుకుపల్లికి చెందిన శేఖర్‌రెడ్డి, రాధమ్మ దంపతుల కుమారుడు ఆర్ హర్శిత్‌రెడ్డి ఆల్ ఇండియా ర్యాంక్ 8,905, ఈడబ్ల్యూఎస్‌లో 907 ర్యాంక్ సాధించాడు. మాస్టర్ ఆఫ్ సర్జన్ చేసి పేదలకు వైద్యం అందించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నట్లు హర్శిత్ రెడ్డి తెలిపారు.

పుట్టపర్తి అర్బన్: సుబ్బరాయనిపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కం టైలర్ అయిన బాబు అనిత ల కుమారుడు వడ్డె మనోజ్‌కుమార్ శనివారం విడుదలైన నీట్ ఫలితాల్లో ఆలిండియాలో 40,633, కేటగిరీలో 19,150 ర్యాంకు సాధించాడు. గ్రామస్తులు మనోజ్‌కుమార్‌ను అభినందించారు.

ప్రశాంతంగా జీవించండి



పోతుకుంట కాలనీ వాసులకు సూచనలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ప్రశాంత వాతావరణంలో జీవించాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శనివారం పోతుకుంట బృందావని కాలనీ వాసులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు పేకాట, మద్యం, జూదం వంటి వాటికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు. కాలనీలో ఏవైనా సమస్యలుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా మహిళల పట్ల గౌరవప్రదంగా వుండాలని ఆయన సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

మండలాభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధం



మాట్లాడుతున్న మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి

నల్లచెరువు: వైఎస్సార్‌సీపీ హయాంలో మండల జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వార్షికోత్సవం సందర్భంగా టీడీపీ నేత నాగభూషణ నాయుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై వైఎస్సార్‌సీపీ నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారని, ఇందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మండలంలోని మహిళలు, రైతులు, విద్యార్థులు, నాయీ బ్రాహ్మణులు, చిరు వ్యాపారులు, చేనేత కార్మికులు.. ఇలా ఏవర్గం ప్రజలను అడిగినా తాము పొందిన సంక్షేమాన్ని వివరిస్తారన్నారు. ఓరువాయి గ్రామంలో ఆలయ భూములను వైఎస్సార్‌సీపీ నేత నరసింహారెడ్డి ఆక్రమించాడని బీజేపీ నాయకులు విమర్శించడం తగదన్నారు. 1984లో బండ్రేవు నరసింహారెడ్డి కొనుగోలు భూమిని కొనుగోలు చేశారని, ఇందులో ఏదైనా తప్పు జరిగి ఉంటే ఆయన కూడా బాధితుడే అవుతారన్నారు. అధికారులు విచారణ జరిపి ఆయనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కోకో కన్వీనర్ రఫీ, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణ, సింగిల్ విండో డైరెక్టర్ ఆదిమూర్తి , టెంపుల్ మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి సీనియర్ నాయకులు నరసింహారెడ్డి,పోరెడ్డింకటరెడ్డి,హైటెక్‌మణ,పల్లె వెంకటరెడ్డి, ఆనంద్‌రెడ్డి, వెంకటరమణ, బాషుసాబ్, సలీం, హిదయతుల్లా, బషీర్, క్లిపల్లి వేమయ్య లక్ష్మీపతి రాయల్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేవీవీలో భాగస్వాములు కండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ తదితరులు

కదిరి టౌన్: శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జనవిజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో శనివారం జేవీవీ సభ్యత్వ ప్రచారానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ ప్రజల కోసం , ప్రగతి కోసం, దేశ స్వావలంబన కోసం సైన్స్ అనే నినాదాలతో 38 ఏళ్ల క్రితం జనవిజ్ఞాన వేదిక ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి తెలుగు ప్రజలతో మమేకమై శాస్త్రీయంగా ఆలోచించాలని మానవత్వంతో జీవించాలని ఆకాంక్షిస్తూ తన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు, నర్సారెడ్డి ,జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్, తహీర్, బాబ్జాన్, ఉపాధ్యాయులు ఎల్లప్ప, జవహర్, రాజారత్నం, శివారెడ్డి, చంద్ర, సలీమ్, బాషా, నాయకులు రామాంజనేయులు, మహబూబ్ బాషా, చిన్నారావు, ఫారెస్ట్ అధికారి హరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంజనాదేవి ఆరాధనోత్సవం



కోన కణ్వాశ్రమంలో అంజనాదేవి విగ్రహాన్ని అలంకరించిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కోన కణ్వాశ్రమంలో శనివారం అంజనాదేవి ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. కోన కణ్వాశ్రమం ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందేందుకు అంజనా దేవి తన దివ్యదృష్టితో ఎంతో కృషి చేశారు. అంజనా దేవి 1977వ సంవత్సరంలో పరమపదించడంతో అప్పటి నుంచి ప్రతి ఏడాది అంజనాదేవి ఆరాధనోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. గోపూజ, ధ్వజారోహణం అనంతరం భగవద్గీత పారాయణం, లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆరాధనోత్సవం సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం 7 గంటల నుంచి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'తల్లికి వందనం' వర్తింపజేయాలి

గాండ్లపెంట: ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వ పథకాలను కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపజేయాలని ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాంప్రసాద్ నాయక్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు చాలీచాలని జీతాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిరు ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు అందేలా నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి పూజలు

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలు, అష్టోత్తర, విష్ణుసహస్ర నామాలు, అంకురార్పణ, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. అనంతరం లక్ష్మీదేవి మేతంగా నరసింహ స్వామిని వెండి కవచాలు, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించి మహామంగళ హారతి ఇచ్చారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి స్వామివారిని కొలిచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదం అందజేశారు.

అలరించిన సంగీత కచేరీ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సత్యసాయి భక్తులు పర్తియాత్ర పేరుతో పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి విచ్చేశారు. శనివారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సామూహిక సత్యసాయి అష్టోత్తర శత నామావళి నిర్వహించారు. సాయంత్రం శతవర్ష స్వరమాధురి పేరుతో సంగీత కచేరీ చేశారు. సత్యసాయిని కీర్తిస్తూ సాగిన సంగీత కచేరీతో భక్తులు మైమరచిపోయారు.

జిల్లా క్రికెట్ జట్టుకు ధర్మవరం బాలిక



మైత్రి

ధర్మవరం రూరల్: ధర్మవరంలోని ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న పట్టణానికి చెందిన మైత్రి అండర్–19 బాలికల విభాగంలో జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ఆర్డీటీ కోచ్ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతు ఈ నెల 18 నుంచి 24 వరకు నెల్లూరులో జరిగే క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు తరపున పాల్గొంటుందన్నారు. ఆర్డీటీ ఇస్తున్న ఉచిత కోచింగ్‌తో తాను జిల్లా జట్టుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని మైత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీటీ కోచ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం

తనకల్లు: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వైద్య సిబ్బందిని డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం హెచ్చరించారు. శనివారం బాలసముద్రం ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆరోగ్య సిబ్బంది ప్రజల ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాక్సినేషన్ సక్రమంగా చేపట్టాలన్నారు. మందుల కొరత ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్, మెడికల్ ఆఫీసర్ లోకేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



మహేంద్రనాయక్

కదిరి టౌన్: తల్లిదండ్రులు మందలించారనే కోపంతో ఓ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. వివరాలు.. మడకశిర ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న కృష్ణానాయక్ కుమారుడు మహేంద్ర నాయక్ నాలుగేళ్లుగా నీట్ పరీక్ష రాస్తున్నాడు. అయితే శనివారం విడుదలైన నీట్ పరీక్షల ఫలితాల్లో తగిన మెరిట్ రాకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. మనస్థాపం చెందిన విద్యార్థి సాయత్రం పట్టణంలోని చైర్మన్ స్ట్రీట్‌లోని తన నివాసం నుంచి తన సెల్ ఫోన్ ఇంట్లోనే ఉంచి బయటకు వెళ్లిపోయాడు. ఇంతవరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కృష్ణానాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పునాదులు దాటని ఆరోగ్య కేంద్రం



ధర్మపురిలో పునాదులకే పరిమితమైన విలేజ్ క్లినిక్

ధర్మవరం రూరల్: ధర్మపురి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లీనిక్ పునాదులకే పరిమితమయ్యింది. గత ప్రభుత్వంలో ప్రతి పంచాయతీలోని ప్రజల సౌకర్యార్థం విలేజ్ క్లినిక్‌లను నిర్మించడానికి చర్యలు తీసుకుంది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వాటి నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. అందులో భాగంగా ధర్మపురిలో ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో పంచాయితీ భవనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నడుపుతున్నారు. ఒక్కొక్కసారి పంచాయితీ సమావేశాలను నిర్వహించినప్పుడు రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ స్పందించి ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేయించాలని వారు కోరుతున్నారు.


నాణ్యమైన విత్తనకాయలు పంపిణీ చేయండి

ముదిగుబ్బ: రైతులకు నాణ్యమైన వేరుశనగ కాయలను పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో కలిసి విత్తన కాయలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం పంపిణీ చేస్తున్న కాయల్లో చాలా వరకు నాణ్యత సరిగా లేవన్నారు. నాసిరకం కాయలను వెనక్కి పంపి నాణ్యమైన కాయలను పంపిణీ చేయాలని కోరారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ



వృథాగా ఉన్న జనరేటర్



పాల ట్యాంకర్

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో పాలశీతలీకరణ కేంద్రానికి చెందిన విలువైన పరికరాలు నిరుపయోగంగా మారాయి. కొన్నేళ్ల క్రితం చెన్నేకొత్తపల్లిలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో పాల శీతలీకరణ కేంద్రాన్ని నిర్వహించేవారు. వివిధ కారణాలతో పాలశీతలీకరణ కేంద్రం మూతబడటంతో అందులోని పరికరాలను ఇతర ప్రాంతాలకు తరలించారు. అయితే విలువైన జనరేటర్, పాల ట్యాంకర్‌ను ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉంచారు. ఇవి కొన్నేళ్లుగా ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వీటిని ఇలాగే వదిలేస్తే తుప్పు పట్టి పనికిరాకుండా పోయే అవకాశం ఉంది. పాల శీతలీకరణ కేంద్రం కూడా శిథిలావస్థకు చేరుకుంది. భవనం తలుపులు, కిటికీలు లేకపోవడంతో అది బిక్షగాళ్లు, అసాంఘిక కార్యక్రమాలకు ఆవాసంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

రక్తదానంతో ప్రాణదానం





రక్తదానం చేస్తున్న యువకులు , అవార్డు అందుకుంటున్న రక్తబంధం ట్రస్ట్ సభ్యుడు కేతా లోకేష్

కదిరి టౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆర్డీఓ వి.వి.ఎస్.శర్మ తెలిపారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శనివారం కదిరి ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఉద్యోగులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ఆర్డీఓ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్ర, వైద్యులు మధుసూదన్, హుస్సేన్, విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ పోలప్ప, సీనియర్ అసిస్టెంట్ షమీర్, వెంకటేష్, జకీవుల్లా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్త బంధం ట్రస్ట్ సభ్యులకు అవార్డులు

ధర్మవరం: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో ధర్మవరం రక్త బంధం ట్రస్ట్ సభ్యులకు అవార్డులు దక్కాయని ట్రస్ట్ వ్యవస్థాపకుడు కన్నా వెంకటేష్ తెలిపారు. అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు చేతులమీదుగా రక్తబంధం ట్రస్ట్ సభ్యులు కేతా లోకేష్, చంద్రశేఖర్, సనప కిరణ్‌కుమార్, భాగ్యలక్ష్మి అవార్డులు స్వీకరించారన్నారు.